
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# నమ్మి చేతిస్తే.. నట్టేటా ముంచుతారు

**కాంగ్రెస్ పార్టీపై రైతుల ధ్వజం**



**కాంగ్రెసోళ్ల కాలంల పడ్డ కష్టాలు చాలు.** కరంటు కోసం నడిమి రాతిరి పొలాల పొంటి తిరిగింది చాలు. కరంటు షాకుతో సచ్చిపోయిన తోటి రైతులు ఇంకా గుర్తుకున్నరు. యాది జేసుకుంటే కండ్లల్ల నీళ్లు తిరుగుతున్నయ్. పదేండ్లల్ల అవన్నీ మర్సిపోయేటట్లు జేసిండు కేసీఆరు సారు. అంటే అంత మంచి కరంటు ఇచ్చిండు. ఆయన పుణ్యాన పొలాలకు రికాం లేకుంట కరంటు అస్తున్నది. గీ పదేండ్ల సంది పొలాలు ఎండుడనే ముచ్చటనే లేదు. ఎక్కడ జూసినా పచ్చగున్న పొలాలే కనిపిస్తున్నయ్. మా రైతుల ముఖం జర్రంత మంచిగైంది. పుక్యం ఇస్తున్న కరంటుతో పంటలు మస్తుగ పండి మా బతుకులు దార్లకొచ్చినయ్. ఇంత ముందుకు పోతున్న టైంలనే మళ్ల దిగిండు గా కాంగ్రెసోడు. అధికారంలకు అచ్చేతందుకు నోటికి ఏదొస్తే అదే మాట్లాడుతుండు. ఎద్దు తెల్వదు.. ఎవుసం తెల్వదు వాని ముఖానికి మా పంటలకు మూడు గంటల కరంటు సాలని చెబుతున్నడు. గదేదో 10హస్సర్ల మోటరు వెట్టుకోవాల్నని అంటున్నడు. వాడికేం ఎరుక. ఎరుకలేనోడికి ఎద్దునిస్తే... ఉరికిఉరికి బాయిల వడ్డట.. అట్లున్నది. అందుకే గా కాంగ్రెసోళ్లకు పగ్గాలు ఇచ్చేది లేదు. వాళ్లను గెలిపిచ్చేది లేదు. మాకు రంది లేకుంట జేసిన కేసీఆరు సారే మా బంగారం. మా రైతు బిడ్డ కేసీఆరును మళ్లా సీఎంను జేస్తం. ఇది మా రైతులందరి మాట. అంటూ తమ మనోగతాన్ని నమస్తే తెలంగాణతో పంచుకున్నారు పలువురు రైతులు. వారి మాటల్లోనే..

- మూడు గంటల కరెంట్ సరిపోతుందట
- 24 గంటలు వృథా అంటున్న హస్తం నేతలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- అధికారమిస్తే అంధకారమేనని వాపోతున్న రైతులు
- కేసీఆర్ వెంటే నడుస్తామంటున్న కర్షకులు

## రైతుల బతుకులు ఆగంజేస్తరు..



**కాంగ్రెస్** పాలనలో పంటలకు నీళ్లు పెట్టేందుకు కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక అరి గోస పడ్డాం. పంటను కాపాడుకునేందుకు ఎన్ని కష్టాలు పడ్డమో మాకు తెలుసు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నది. రెండు పంటలకు సరిపడా నీరు అందుతున్నది. రైతుల బాధలు తెలిసిన వ్యక్తి కాబట్టే సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తుండు. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ చాలంటే పంటలు పండుతయా? రైతు అగం కావాలనే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొమ్మంటున్నరు. కాంగ్రెసోళ్లు మళ్లీ రైతులను ఇబ్బందిపెట్టడం కాకపోతే ఇంకేంటి? రైతులు బరాబర్ బీఆర్‌ఎస్‌కే మద్దతుగా నిలుస్తరు.

**-పుట్టి గంగాధర్, బోర్గాం, రెంజల్ మండలం**



## మళ్లీ కరెంటు కోసం కావలి పోవాలె..

**కాంగ్రెస్ ప్రభుత్వం** వస్తే కరెంటు కోసం ఎదురుచూస్తూ పొలం కాడనే కావలి ఉండాలె. ఒక గుంట పారుతది.. ఒక గుంట ఎండుతది. రైతులు మస్తు గోసవడ్డరు. గా బాధలు పోయి పదేండ్లాయె. రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఫ్రీ కరెంటు చాలా బాగుంది. 3 గంటల కరెంటు ఇస్తే ఏం జేసుకోవాలె. 10 ఎస్పర్ మోటరు పెడితే బోర్లల్ల, బాయిలల్ల నీళ్లుంటాయా? ఇప్పుడిప్పుడే రైతులు రంది లేని ఎవుసం చేస్తున్నరు. సమయానికి పెట్టుబడి సాయం అందుతున్నది. కరెంట్‌కు మీటర్లు లేవు. కరెంటు పోతలేదు. తీరికున్నప్పుడు పొలాలకు పోయి నీరు పారిస్తున్నం. మాకు 3గంటల కరెంట్ ముచ్చటనే వద్దు.

**-పోసాని, నీలా, రెంజల్ మండలం**

## కాంగ్రెస్ అంటే భయం.. కేసీఆర్ అంటే భరోసా



**కాంగ్రెస్ అంటే భయం..** కేసీఆర్ అంటే రైతులకు భరోసా. పదేండ్ల కిందట కరెంటుతోని రైతులు ఎన్నో కష్టాలు చూశారు. ఒక్క గుంట నీళ్లు పారంగనే కరెంటు పోతుండె. కరెంటు ఎప్పుడస్తుండెనో తెల్వకుండె. సగం పంటలు ఎండిపోతుండె. మూడు గంటల కరెంటు సరిపోతది అంటున్న కాంగ్రెస్ మాటలకు రైతులు మోస పోవద్దు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీతో గోసవడ్డ రోజులు అందరికీ తెలుసు. మళ్లీ 3 గంటల కరెంటు.. 10 హెచ్‌పీ మోటర్లు అని రెవంత్‌రెడ్డి రైతులకు చెప్తుండు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే.. రాత్రి కరెంటు.. పొద్దున కరెంటు అని ముప్పుతిప్పలు పెడ్తరు. రైతులను నిండా ముంచుతరు. రైతులు పొరపాటున కూడా కాంగ్రెస్‌ను తెచ్చి నెత్తిన పెట్టుకోవద్దు. సీఎం కేసీఆర్ మంచి కరెంటు ఇస్తున్నారు. బాధ లేకుండా పంటలు పండిస్తున్నం. బీఆర్‌ఎస్ సర్కారు వస్తేనే రైతులకు మంచిది.

**-పుట్ట కేశవ్, ఎడపల్లి**

## కాంగ్రెసోళ్లు రైతులను ముంచేటట్టే ఉన్నరు..



దేశాన్ని, రాష్టాన్ని 60 ఏండ్లు పాలించినా కాంగ్రెస్‌కు అధికార దాహం తీరలేదు. వారి పాలనలో రైతులు ఏనాడూ సుఖంగా లేకుండె. ఇప్పుడేమో రేవంత్‌రెడ్డి హుషార్‌తనం చేస్తుండు. 3 గంటల కరెంటు.. 10 హెచ్‌పీ మోటర్లు అని చెప్తుండు. కానీ రైతులు కాంగ్రెస్‌ను నమ్మరు. ఎందుకంటే తెలంగాణ సర్కారు వచ్చినంకడే రైతులు అన్ని విధాలా సంతోషంగా ఉన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నరు. వ్యవసాయానికి పుష్కలంగా నీరు ఉండబట్టే భూముల ధరలు బాగా పెరిగినయ్. కాంగ్రెస్ హయాంలో ఉన్న ధరలకు.. ఇప్పుడున్న ధరలకు పది రెట్లు తేడా ఉంది. పొలానికి నీరు మంచిగ అందడంతో దిగుబడి బాగా వస్తున్నది. వడ్ల ధరలు కూడా తెలంగాణ ప్రభుత్వం బాగా పెంచింది. కాంగ్రెసోళ్లు రైతులను ముంచేటట్టే ఉన్నరు. సాఫీగా సాగుతున్న వ్యవసాయాన్ని ఆగం చేసే ప్రయ్నతం చేస్తున్నరు.

**-కల్లెం రాములు, లింగాపూర్, నవీపేట మండలం**

## కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవు..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు. అప్పట్లో కరెంటుతో అరి గోస పడ్డం. అది మర్చి పోలేదు. రాత్రుల్లు కరెంటు కోసం బ్యాటరీ లైట్లు పట్టుకొని కావలి కాసేవాళ్లం. కరెంటు సక్కగ ఉండేది కాదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంక కరెంటు పోతదనే బాధ లేదు. ఎప్పుడు తీరిక ఉంటే అప్పుడు పోయి బోరు వేసుకొని నీళ్లు పారిస్తున్నాం. తెలిసి..తెలిసి కాంగ్రెస్‌ను తెచ్చుకుంటమా? మా బతుకుల్ని ఆగం చేసుకుంటమా?

**-తడగాం సాయరెడ్డి, ఎడపల్లి**



## రేవంత్ మాటలింటే కష్టాలే..

**కొట్లాడి తెలంగాణ** తెచ్చిన సీఎం కేసీఆర్.. సాగుకు ఇస్తున్న నాణ్యమైన 24 గంటల త్రీఫేజ్ కరెంట్‌తో బీడు భూములు పచ్చగైనయ్.. గీ పదేండ్లలో రైతులను రాజులను చేసిండు. కాంగ్రెస్ హయాంలో కరెంట్ లేక నానా ఇబ్బందులు పడ్డం. కాంగ్రెస్ వాళ్లు 10 ఎస్పర్ మోటర్ పెట్టుకోమంటే నవ్వొస్తున్నది. అంత పెద్ద మోటర్లు కొనాలంటే మాటలా? చాలా ఖర్చవుతుంది. రేవంత్ మాటలు వింటే మాకు మళ్లీ కష్టాలే. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించి మా సత్తా చాటుతాం.

**-పఠాన్, సాటాపూర్, రెంజల్ మండలం**





## 3 గంటల కరెంటు సరిపోదు..



**రెండు పంటలు** తీస్తున్నమంటే అది సీఎం కేసీఆర్ పుణ్యమే. 24 గంటల కరెంటుతో ధైర్యంగా సాగు చేసుకుంటున్నం. కరెంట్ ఉంటెనే పంటలకు నీళ్లందుతాయి. లేదంటే కష్టం. కాంగ్రెస్ సర్కారు వస్తే రైతులు గోస పడుడే. కరెంట్ ఇవ్వరు. నీళ్లు ఇవ్వరు. 3గంటల కరెంటు దేనికి సరిపోతది. వరి పండించాలంటే కనీసం 9 నుంచి 10 గంటల కరెంటు అవసరం. 3 గంటల కరెంటుతో 3 గుంటలు కూడా తడిపెట్టలేం. వారి మాటాలు వింటే వ్యవసాయం చేసినట్టే.

**-శ్రీనివాస్ , జంలం, ఎడపల్లి మండలం**





## 3 గంటల కరెంటు వద్ద.. కాంగ్రెస్ సర్కారు అసలే వద్దు..

**మాకు సీఎం కేసీఆర్** ఇస్తున్న 24 గంటల కరెంటే గావాలే.. కాంగ్రెసోళ్లు ఇచ్చే 3గంటల కరెంట్‌తో మోటర్లు నడవలేవు. మూడు గంటల కరెంట్ అద్దు.. గా కాంగ్రెస్ అసలే అద్దు. గతంలో కరెంట్ కోతలతోని అరిగోస పడ్డం. 10ఎస్పర్ మోటరు పెట్టు కోవాలంటున్నరు.. అవి పెడితే బోర్లల్ల నీళ్లు ఉంటయా? అవి పెట్టుకోవలన్నా మస్తు పైసలైతయ్. ఇప్పుడిస్తున్న 24 గంటల కరెంట్‌తో పొలాలు మంచిగ పండుతున్నయ్.

**-బండారి ఎల్లప్ప, నీలా గ్రామం, రెంజల్ మండలం**

## 3 గంటల కరెంటుకు ఓటేస్తమా?



**కేసీఆర్ సర్కారు** వచ్చినంక 24 గంటల కరెంటు ఫ్రీగా ఇస్తున్నది. ఏ కష్టం రానీయకుండా రైతులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్నది. ఇప్పుడున్న కరెంటు చాలా బాగుంది. మాకు నచ్చినప్పుడు పొలానికి పోయి నీళ్లు పారిస్తున్నం. కరెంటు పోతదనే రంది లేదు. కాంగ్రెస్ నాయకులు 3 గంటలే కరెంటు ఇస్తరంట. వాళ్ల మాటలు వింటే ఆగమవుడే.. దాంతోని ఏ పొలం పారిస్తం. ఇది రైతులను మోసం చేసుడు కాదా? దస్ ఎస్పర్ మోటర్లు పెట్టుకోవాల్నంట.. రైతులు బాగుండాలని లేదా? అందుకే తప్పుడు మాటలతో తప్పుదోవ పట్టించాలని చూస్తుండ్రు. 10 ఎస్పర్ మోటర్లు పెట్టుకోవాలంటే ఎట్లా? ఈ మోటర్ నడిపిస్తే భూమిల నీళ్లుంటయా? ఈ తొమ్మిదేండ్లల్ల కరెంటు బాధలంటే ఏందో మర్చిపోయినం. గింతమంచి కరెంటియ్యంగ.. 3గంటల కరెంటిస్తం అనే కాంగ్రెస్‌కు ఓటేస్తమా? ఒకవేళ ఏస్తే.. పరేషానే. బరాబర్ బీఆర్‌ఎస్‌నే గెలిపించుకుంటం.

**-తడగాం నాగిరెడ్డి, ఎడపల్లి**